క్లుప్తంగా

పోలీస్ ప్రజావాణిలో 66 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజావాణి)లో 66 మంది ఫిర్యాదులు అందజేశారు. డీసీపీలు కృష్ణమూర్తి నాయుడు, ఉదయరాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగదు లావాదేవీలపై తొమ్మిది, కుటుంబ కలహాలపై ఆరు, భూ వివాదాలపై ఏడు, మోసాలకు సంబంధించి 15, వేధింపులపై ఏడు, దొంగతనాలపై ఐదు, చిన్న చిన్న వివాదాలపై 17 మంది ఫిర్యాదులిచ్చారు. ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులను డీసీపీలు ఆదేశించారు.

30 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం మత్తులో మోటారు వాహనాలు నడిపిన 30 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి. శర్మ సోమవారం జరిమానా విధించారు. ఆరవ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 30 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

మరో 8 మందికి..

పాయకాపురం(విజయవాడరూరల్): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి ఆరవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సోమవారం జరిమానా విధించారు. ఈ నెల మూడవ తేదీన నున్న సీఐ పి. కృష్ణమోహన్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎనిమిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు, మరో ముగ్గురికి రూ. 15వేలు జరిమానా విధించారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కార్తిక మాసంలో సత్యనారాయణ వ్రతం విశిష్టతను వివరించారు. కార్తిక మాసంలో ప్రతి ఒక్కరూ సత్యనారాయణ వ్రతం చేసుకోవాలనే సదుద్దేశంతో తాము ప్రతి ఏటా సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు.

విలీన అధ్యాపకులకు అన్యాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికల్లో ఈ సంవత్సరం కూడా ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు తీవ్ర అన్యాయం జరిగిందని విలీన కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ కొల్లేటి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రీనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్‌కు అభినందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్న శ్రీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని నేషనల్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కొనియాడారు. ఈనెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కలిగినీడి గంగాధర రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి రామకృష్ణ పాల్గొని శ్రీనగర్ అసోసియేషన్ సేవలను వివరించారు.

గొట్టుముక్కల రఘుకు సన్మానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శ్రామిక, కార్మిక హక్కుల కోసం టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా అలుపెరుగని పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి గొట్టుముక్కల రఘురామరాజు అని, రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్'గా ఆయన్ను నియమించడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. టీడీపీ నాయకుడు ఘంటా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గొట్టుముక్కల రఘుకు సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. టీడీపీ నాయకులు చౌదరి సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషంరాజు, వెంకటేశ్వరరాజు(వెంకీ), వెలగపూడి శ్రీను, రామకృష్ణారెడ్డి, శంకర్, వేపడ రమణ, శేషు, షేక్ జిల్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం.. బతుకులు ఛిద్రం

- మత్తులో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వైనం
- ఒక్క సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలలోనే మూడు మరణాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మందుబాబులకు తీరని అన్యాయం జరుగుతోంది. నాణ్యమైన మద్యాన్ని సేవించి మీరంతా పదిమందికి చెప్పాలి.. ఇదీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు 'కదిరి'లో జరిగిన సభలో మాట్లాడిన మాటలు. అయితే మందుబాబులు పదిమందికి చెప్పడం మాట పక్కన పెడితే అదే పదిమందికి వారు మద్యం సేవించి చుక్కలు చూపించడం.. మరో పదిమంది బతుకులు ఛిద్రం చేస్తున్న ఘటనలు ప్రస్తుతం కళ్లముందు కనిపిస్తున్నాయి. ఒక్క సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే నెల రోజుల వ్యవధిలో జరిగిన మూడు వరుస ఘటనలకు ఈ మద్యం మహమ్మారే కారణంగా తేలింది.

శోక సంద్రంలో కుటుంబాలు

వారిద్దరు చిన్ననాటి స్నేహితులు.. 54 సంవత్సరాల వయస్సు వచ్చినా.. కుటుంబ బరువు బాధ్యతలు మీదపడినా.. సమాజంలో ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా.. ఊరు కాని ఊర్లో నివసిస్తున్నా.. నెలకోసారైనా స్నేహితులిద్దరూ కలుసుకొని బాధలన్నీ మరచిపోయి సరదాగా గడిపేవారు. అయితే వారిద్దరి మధ్యలో మద్యం ఒక్కసారిగా మాటల తూటాలను పేల్చింది. ఏం జరిగిందో.. ఏమనుకున్నారో తెలీదు.. అప్పటి వరకూ ప్రాణానికి ప్రాణం అనుకున్న వారే క్షణాల్లో బద్ధశత్రువులుగా మారి ఓ స్నేహితుడి ప్రాణాన్నే లేకుండా చేసుకున్నారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్



మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్న మహిళ



గత నెలలో అయోధ్యనగర్‌లో హత్యకు గురైన రఫీ

పరిధిలోని అయోధ్యనగర్‌లో గత నెల 22న చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎండీ రఫీ అనే వ్యక్తి కానరాని లోకాలకు చేరగా.. ఆయన్నే నమ్ముకొని ఉన్న అతని భార్య, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారు అయ్యారు.

- స్నేహితులతో కలిసి రాత్రంతా మద్యం సేవించిన ఓ మహిళా ఈవెంట్ డ్యాన్సర్ తెల్లవారేసరికి అదే మద్యం మత్తులో చేతి మణికట్టును కోసుకొని.. ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గత నెల 29వ తేదీన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందమూరినగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆ మహిళ మృతిచెందగా.. ఆమె కుమారుడు తల్లిలేని వాడు అయ్యాడు.
- మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావడం.. బైకు నడుపుతూ కిందపడి కాళ్లు విరక్కొట్టుకోవడం.. మద్యం మత్తులో అకారణంగా రోడ్డుపై వ్యక్తులతో గొడవలు పడటం.. ఇలా చెప్పుకుంటూ పోతే పూటకో సంఘటన.. రోడ్డుకో గొడవ చోటుచేసుకోవడం నిత్యకృత్యంగా మారిపోయాయి.

మద్యం ఏదైనా మనిషికి హానియే..

మద్యం మంచిదా.. చెడ్డదా అనే విషయాన్ని పక్కన పెడితే.. అసలు మద్యమే హానికరం. అది మన కష్టార్జితంతో మన ఆరోగ్యాన్ని దెబ్బ తీయడం ఒక పద్ధతి అయితే.. మనల్నే రాక్షసులుగా చేసి ఇతరులపై దాడులకు పాల్పడటం.. మనల్ని మనమే చంపుకొనేంత బలహీనులుగా మార్చేస్తుంది. మంచి ఆహారమైనా.. మందులైనా.. మద్యమైనా.. మితంగా ఉన్నంత వరకే ఆనందమని హద్దు మీరితే ఏదైనా అనర్థాలనే కొని తెస్తాయని వైద్య, మానసిక నిపుణులు చెబుతున్నారు. మద్యం మహమ్మారికి బహు దూరంగా ఉండటం ఉత్తమమని వారు సూచిస్తున్నారు. మద్యం సేవించిన సమయంలో మీ ప్రాణాల కోసం.. మిమ్మల్ని నమ్ముకున్న వారి జీవితాల కోసం ఆలోచనలు చేసి తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని మనవి చేస్తున్నారు.

ప్రజాఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా శాఖాధిపతులు కచ్చితంగా ఫీల్డ్‌లోకి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కమిషనర్ స్వయంగా నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి శాఖాధిపతులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం నిర్వహణ, ఆక్రమణలు, సుందరీకరణ, నీటి కులాయి, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైయినేజీ, డ్రైయిన్ కల్వర్టులు, ఇంటి పట్టా, ఆస్తి పన్నుల్లో డోర్ నంబర్ సరి చేయడం, డ్రైయినేజీ తదితర సమస్యలపై ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, టౌన్ ప్లానింగ్ విభాగంలో



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నాలుగు, ప్రజారోగ్యంలో మూడు, రెవెన్యూపై రెండు ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యనారాయణ కుమారి, జాయింట్ డైరెక్టర్, ఇన్చార్జి పీఓ (యూసీడీ) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, డీఎఫ్ఓ మల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన సాహిల్‌కు అభినందన



విజయవాడస్పోర్ట్స్: తమిళనాడులోని కోయంబత్తూరులో ఇటీవల జరిగిన జాతీయ జూనియర్(అండర్-16) అథ్లెటిక్స్ పోటీల 80 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకం సాధించిన కె.ఎస్.ఎస్. సాహిల్‌బాబును ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. ఏలూరుకు చెందిన సాహిల్ శాప్ కార్యాలయంలో చైర్మన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించడం శుభపరిణామమని చైర్మన్ అన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడా వేదికల పైనా సత్తా చాటాలని సాహిల్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్, తెలుగు యువత ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు సూర్యచందు పాల్గొన్నారు.

రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో రాణించిన జెస్సీరాజ్, జోయల్ఆదర్శ్



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి 36వ స్కేటింగ్ పోటీల్లో విజయవాడకు చెందిన మాత్రపు జెస్సీరాజ్, మాత్రపు జోయల్ ఆదర్శ్ సత్తాచాటారు. ఈ నెల ఆరు నుంచి 11వ తేదీ వరకు మంగళగిరిలోని మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జెస్సీరాజ్ మూడు (ఇన్‌లైన్ విభాగంలో సిల్వర్, సోలో డాన్స్ విభాగంలో సిల్వర్, ఫిగర్ విభాగంలో బ్రాంజ్) పతకాలు, జోయల్ ఆదర్శ్ రెండు(ఇన్‌లైన్, ఫిగర్ విభాగాల్లో బ్రాంజ్) పతకాలు సాధించారు. జెస్సీరాజ్ పటమటలోని ఎస్ఎస్ఎం స్కూల్‌లో తొమ్మిదో తరగతి, జోయల్ఆదర్శ్ కానూరులోని షామ్‌రాక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్‌చౌదరి, చైర్మన్ పవన్‌కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు.

శివతత్వాన్ని చాటిన భక్త మార్కండేయ హరికథా గానం

విజయవాడ కల్చరల్: గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా విఖ్యాత హరికథా భాగవతులు గుడిపాటి జయరాం సుధాకర్ సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన భక్త మార్కండేయ హరికథా గానం శివతత్వాన్ని చాటింది. మార్కండేయుని కథ పిల్లలకు చెప్పాలని భాగవతులు జయరాం సుధాకర్ అన్నారు. మృకుండ మహర్షికి పుత్ర సంతానం లేకపోవడం, ఆయన శివుని గురించి తపస్సు చేయడం, దాంతో శివుడు ప్రత్యక్షమై అల్పాయుష్కుడైన మార్కండేయుని ప్రసాదించడం, మృత్యువు చేరువైన మార్కండేయుడిని యముడు తీసుకువెళ్లడానికి రావడం శివుడు అతనికి చిరంజీవిగా ఉండమని ఆశీర్వదించడం అంశంగా కథనం సాగింది. చావలి



భక్త మార్కండేయ హరికథా గానం చేస్తున్న జయరాం సుధాకర్

శ్రీనివాస్, చావలి కృష్ణమోహన్ వాద్య సహకారం అందించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, చెట్లపల్లి మారుతీ ప్రసన్న జయరాం సుధాకర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

నూర్‌బాషాలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు రసూల్ సాహెబ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు నూర్‌బాషా సంఘీయులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒ. రసూల్ సాహెబ్ డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఒక హోటల్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నూర్‌బాషాల అభివృద్ధికి రూ. 100 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా ఆ హామీ ఊసెత్తడం లేదన్నారు. జనవరి ఐదవ తేదీలోగా హామీని నిలబెట్టుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రసూల్ సాహెబ్

లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూర్‌బాషాలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువ జరుగుతున్నాయని పేర్కొన్నారు. నూర్‌బాషాలకు రక్షణ లేకుండా పోయిందని దాడులు పునరావృతంగా కాకుండా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం నాయకుడు షేక్ నాసర్ వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి బాటలు వేసిన వ్యక్తి ఆజాద్

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని విష్ణు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన పార్టీ నాయకులతో కలిసి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ.. దేశంలో గుణాత్మక విద్యకు ఆజాద్ మార్గదర్శి అని.. విద్యావ్యవస్థ పటిష్టతకు, చిన్నారుల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ఆయన వేసిన అడుగులు మరువలేనివన్నారు. ఆ మహనీయుని సేవలను భావితరాలు స్మరించుకునే రీతిలో ఆజాద్ జయంతిని మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా 2008లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. అలాగే ముస్లింల అభ్యున్నతికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని పేర్కొన్నారు. ఆజాద్ స్ఫూర్తితో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. ఆజాద్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఎండీ షాహినా



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

సుల్తానా, శర్వాణీమూర్తి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, కుక్కల రమేష్, అక్బర్, పఠాన్ నజీర్ ఖాన్, ఇస్మాయిల్, ఫాతిమా పాల్గొన్నారు.

ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో..

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సింగ్‌నగర్‌లోని మస్జిద్ ఏ రిజ్వాన్ ఎదురు ఆజాద్ ముస్లిం కమిటీ దిమ్మ వద్ద సోమవారం నిర్వహించారు. ఆ కమిటీ 58వ డివిజన్ ఇన్‌ఛార్జ్ షేక్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా విచ్చేసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఎండీ కాలేషా, షేక్ మస్తాన్, సిలార్ బేగ్, షేక్ రజియా, షేక్ మస్తాన్ వలీ, మునీర్ అహమ్మద్, నాగుల్ మీరా, అబ్దుల్ నబి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యావ్యవస్థను పటిష్టం చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి దేవినేని అవినాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ.. రాజకీయ రంగంలో స్ఫూర్తిదాయకమైన నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్, ఇతర నేతలు

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చేందుకు సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, మైనార్టీ నాయకులు మీర్ హుస్సేన్, ఎండీ రిజ్వాన్, పార్టీ నేతలు భీమిశెట్టి బాబు, సుభాషిణి, కోటి నాగులు, మాతంగి రాజేష్, మెరకనపల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు సూచించారు. జేఎమ్ఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలోని మినీ ఆడిటోరియంలో రెండు రోజులపాటు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు, పాటల పోటీలు సోమవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం అలవాటు చేయాలని అన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చునని సూచించారు. నిర్వాహకులు విజేతలకు బహుమ



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తులు అందజేశారు. అనంతరం అతిథులను ఆత్మీయంగా సత్కరించారు. గాయకులు వెంకటేష్, శ్రావణి, రత్నకుమారి, దుర్గానాయుడు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో బాజీ, ఝాన్సీ, ఆర్. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌వి దిగజారుడు రాజకీయాలు

ఆమ్ ఆద్మీ పార్టీ జోన్ సీ కోఆర్డినేటర్ మహేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెడతామని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జోన్ సీ కోఆర్డినేటర్, చార్టెడ్ అకౌంటెంట్ నేతి మహేశ్వర రావు విమర్శించారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సర్వీస్ రూల్స్ ప్రకారం ప్రజల కోసం పనిచేయాలని, అలా జరగని నాడు ప్రతి ఒక్క పౌరుడికి సదరు అధికారులను ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై పెట్టిన కేసుల విషయంలో కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రవర్తిస్తోందా? లేక కక్షపూరితంగా ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తోందా అని ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో యూనియన్ బ్యాంక్ అగ్రగామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక సేవల్లోనూ అగ్రగామిగా ఉందని ఆ బ్యాంక్ విజయవాడ రీజియన్ హెడ్ ఎం.శ్రీధర్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్యాంక్ విజయవాడ రీజనల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్ అవగాహనా సదస్సు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. 106 ఏళ్లుగా దేశ ప్రజల అభివృద్ధికి, ఆర్థిక అభ్యున్నతికి యూనియన్ బ్యాంక్ అండగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఉదయం నుంచి బ్యాంకు కార్యాలయంలో మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం జరిగింది. సాయంత్రం డాక్టర్ లక్ష్మీప్రసూన క్యాన్సర్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ జోనల్ హెడ్ ఎం.సీతారామారావు, ఏజీఎంలు ఐ.ఎస్.ఎస్. మూర్తి, హరీష్ బేతా, రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్.మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



దీపోత్సవంలో వెలిగించిన దీపాలు



దీపోత్సవంలో ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, విద్యాసాగర్ తదితరులు



ముత్యాలంపాడులో రామలింగేశ్వరస్వామి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని శైవ క్షేత్రాలు కార్తిక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని దీపారాధనలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్వామివారికి విశేషంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. రామకృష్ణాపురం కోడూరు రాజు వీధిలో లక్కిరాజు శ్రీనివాస వర్మ బృందం ఆధ్వర్యాన కోటి దీపోత్సవ కార్యక్రమం జరిగింది. ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు విద్యాసాగర్, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు కళ్లేపల్లి మధుసూదనరాజు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు.